క్లుప్తంగా

348 మందికి జగనన్న తోడు

బల్లికురవ: తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకొని జీవించేవారికి జగనన్న తోడు పథకంలో 385 మందిని ఎంపిక చేసినట్లు వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ. సురేంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 సచివాలయాల పరిధిలో ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 18న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొమ్ము విడుదల చేయగానే సంబంధిత బ్యాంకర్ల ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు జమవుతుందని వివరించారు.

షాదీ తోఫా ప్రకటనపై హర్షం

అద్దంకి: నూర్‌బాషా ముస్లింలకు షాదీ తోఫాను ప్రకటించిన వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్యకు ఆ సంఘ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. వివాహం చేసుకున్న జంటకు రూ.1 లక్ష ఇవ్వడం హర్షణీయమన్నారు. రాష్ట్ర యువజన ప్రచార కార్యదర్శి కొటికలపూడి శ్రీను మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ నూర్‌బాషా సంక్షేమానికి కట్టుబడినట్లుగానే సీఎం జగన్ మోహన్‌రెడ్డి కట్టుబడ్డారన్నారు. రాబోయో రోజుల్లోనూ జనగన్న ప్రభుత్వమే రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీ మౌలాలి, షేక్ నాగూర్, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం మన బాధ్యత

అద్దంకి: రక్తదానం చేయడం మన బాధ్యత అని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని నాగులబండ బజారులో నివాసం ఉంటున్న బొమ్మిశెట్టి లక్ష్మి కళ్యాణికి బీ-నెగిటివ్ బ్లడ్ అవసరపడగా, రోటరీ బ్లడ్ డొనేషన్ ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకర రావు ప్రోత్సాహంతో చిన్న కామేశ్వరరావు అవసరమైన రక్తాన్ని ఇచ్చారు.

17,19 తేదీల్లో జగనన్న సురక్ష ముగింపు

మార్టూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 17,19 తేదీల్లో మండలంలో ముగియనుంది. నేడు మార్టూరు 2,4 సచివాలయాల్లోను 19వ తేదీ చిమ్మిరిబండ, మార్టూరు-3 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమస్యలను ఆయా పరిధిలోని ప్రజలు కార్యక్రమానికి హాజరై సంబంధిత ధ్రువీకరణ పత్రాలు పొందాలని ఎంపీడీవో కే లక్ష్మీకుమారి తెలిపారు.

నేడు బాలికలకు సైకిళ్లు పంపిణీ

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ భవనంలో సోమవారం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూసపాడు, వీరన్నపాలెం, అన్నంబొట్లవారిపాలెం, పర్చూరు తదితర గ్రామాలలోని పాఠశాలలో చదువుకుంటున్న 57 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం, పునర్వసు నక్షత్రం అమావాస్య తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. అమావాస్యను పురస్కరించుకుని నేడు ఆంజనేయ స్వామికి దశ సహస్ర కదలీఫలార్చన చేస్తారని ఏసీ సుభద్ర తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

బల్లికురవ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం కొప్పరపాలెం, వైదన గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో, తహశీల్దార్ కే రవిబాబు రెండు టీములుగా రెండు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. వివిధ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు. ఉదయం 9 గంటలకు ఆయా సచివాలయాల వద్ద జరిగే క్యాంపునకు హాజరు కావాలని ఆయన కోరారు

వలంటీర్లకు వందనం

ఆసుపత్రిలో ఉన్న నాకు పింఛన్ అందించారు..

నా పేరు యర్రమాల సుభాషిణి. నేను చినగంజాం-1 సచివాలయం పరిధిలో నివాసముంటున్నాను. నాకు తీవ్ర అనారోగ్యం తలెత్తడంతో గుంటూరులోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందాను. ఖర్చులకు నా చేతిలో నగదు లేదు. ఏమి చేయాలో పాలుపోలేదు. పింఛన్ సమయానికి ఇంటి దగ్గర లేకపోవడంతో డబ్బులు కూడా తీసుకునే పరిస్థితి లేక పోయింది. నా పరిస్థితి తెలుసుకున్న మా వలంటీర్ పైడిపోగు వినోద్ తన సొంత ఖర్చులతో హాస్పిటల్‌కు వచ్చి పింఛను ఇచ్చి వెళ్లాడు. నిజంగా వలంటీర్‌లను పెట్టిన జగనన్నకు వందనాలు.



పింఛను అందుకుంటున్న సుభాషిణి

మా వలంటీర్ ఆసుపత్రికి వచ్చి పింఛను ఇచ్చింది..

అప్పట్లో నేను ఆసుపత్రిలో నెమ్ము వ్యాధితో చికిత్స పొందాను. నేను ఇంటి దగ్గర ఉన్నట్లయితే పింఛను తీసుకునే దాన్ని. ఇంటికి రాలేని పరిస్థితిలో ఆసుపత్రిలో ఉన్నప్పటికీ జాగర్లమూడి సచివాలయం వలంటీర్ అట్లూరి ప్రవల్లిక నా పరిస్థితి తెలుసుకుంది. గుంటూరులో బెడ్‌మీద ఉన్న నాకు 60 కిలోమీటర్లు తన స్కూటర్‌పై వచ్చి మరీ పింఛను ఇచ్చి వెళ్లింది. కరోనా కష్టకాలంలో వారందించిన సేవలు మరువలేను. అప్పుడు కూడా ఇదే విధంగా నాకు సాయమందించి వలంటీర్ ఆదుకుంది. వారి మేలు ఈ జన్మలో మర్చిపోలేను.



పింఛను అందిస్తున్న ప్రవల్లిక

\- గాదె దేవి, జాగర్లమూడి

నిరంతర సేవకులు

చినగంజాం/కారంచేడు/యద్దనపూడి: వలంటీర్ వ్యవస్థ ఒక సంచలనం. దేశంలో ఎక్కడా లేని విధానం మన రాష్ట్ర సొంతం. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు చేరువ చేయాలన్నా లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సంచలనం సృష్టించాడు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించాడు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పలు రకాల పింఛన్లను ఒకటో తేదీనే ఉదయాన్నే తలుపుతట్టి వలంటీర్ ద్వారా అందించిన ఘనత ప్రభుత్వానిది. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో విసిగివేసారిన ప్రజలు వలంటీర్‌ల రాకతో అన్ని పథకాలు గడప వద్దకే అందుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైస్ కార్డులో మాపాప పేరు చేర్చారు..

బియ్యం కార్డులో మా పాప సుహానా పేరును చేర్చేందుకు వలంటీర్ అందించిన సేవలు చెప్పలేం. మామూలుగా మేము సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకొని, తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడకూడా వీఆర్వో మొదలు ఇతర అధికారులను కలిసి బతిమలాడుకోవడం చాలా కష్టంగా ఉండేది. ఎంతో కష్టమని భావించాం. అలాంటిది మా వలంటీర్ దనరాజుపల్లి నాగరాజు మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటికి తెచ్చి ఇచ్చాడు. గ్రామంలో వలంటీర్‌లు చేస్తున్న సేవలు చూస్తుంటే ముచ్చటేస్తుంది.



\-షేక్ సిలార్ అతని భార్య, కుమార్తె

వలంటీర్ మా ఇంటిలో సభ్యురాలైంది..

మా కుటుంబానికి కావాల్సిన అన్ని పనులలో తానై ఉంటూ మా వలంటీర్ పాదర్తి స్వాతి ఇంట్లో సభ్యురాలు అయిపోయింది. ప్రతి రోజు ఇంటి వైపు వస్తూ మమ్మల్ని పలకరించడంతో పాటు ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలను గురించి మాకు వివరిస్తూ వచ్చేలా చూస్తుంది. అమ్మఒడి, ఇంటి స్థలం, కుల, ఆదాయ సర్టిఫికేట్‌లు ఇప్పించడం, జ్వరాల సర్వే, మందులు ఇచ్చేలా చేసింది.



\- ప్రసన్న, మూలగానివారిపాలెం

రోశయ్య కాలనీలో కార్డన్ సెర్చ్

- 8 బైక్‌లు, 4 ఆటోలు సీజ్

చీరాల: అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోశయ్య కాలనీలో ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మహేష్ సూచనలతో డీఎస్పీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఒన్‌టౌన్, టూటౌన్, చీరాల రూరల్, కారంచేడు ఎస్సైలు, సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, నాటుసారా ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సెర్చ్ నిర్వహించారు. పత్రాలు లేని 8 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను పోలీస్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపి అణిచివేస్తున్నామన్నారు. అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించిన కేసుల్లో పట్టుబడిన వారిపై సస్పెక్ట్ షీట్స్ తెరుస్తున్నామన్నారు. గంజాయి విక్రయించే వారు విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని విక్రయాలు జరిపే అవకాశం ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు గంజాయి సేవించడం వలన కలిగే అనర్థాలను, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కార్డన్ సెర్చ్‌లో ఒన్‌టౌన్ సీఐ వీ మల్లికార్జునరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, సెబ్ సీఐ సోమయ్య, ఎస్సైలు, 55 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న సీఐ



సంచిని పరిశీలిస్తున్న టూటౌన్ సీఐ

మానవులంతా శాంతి కలిగిఉండాలి



కార్యక్రమంలో నూర్‌బాషా సంఘ పెద్దలు

జే.పంగులూరు: మానవులంతా ఒక్కటే అని.. ముస్లింలు, హిందువులు కలిసి మెలిసి జీవించాలని, ఇస్లాం గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అహ్లెహదిస్ కమిటీ, నూర్‌బాషా సంఘం పెద్దలు అన్నారు. మండల కేంద్రం అయిన పంగులూరులో ఆదివారం మసీద్ సందర్శనకు ఆహ్వానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నూర్‌బాషా సంఘ మత పెద్దలు మాట్లాడుతూ మానవులంతా శాంతియుతంగా జీవించాలని, మత సామరస్య భావాలు పెంపొందించుకోవాలని కోరారు. ఇస్లాంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించే విధంగా కార్యక్రమం రూపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటి సభ్యులు అమీర్, అహ్మద్, ఇస్మాయిల్, ఖాదర్, మసీద్ కమిటీ సభ్యుల, కొరిశపాడు సలీం దాయి, పీరు సాహెబ్, సైదావలి, కాసిం సాహెబ్, బాబులు, అసాన్, ఉల్లగంటి వలి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీ

బల్లికురవ: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ముడిరాయి లారీని మైన్స్ అండ్ విజిలెన్స్ అధికారులు శనివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి మల్లాయపాలెం మీదుగా వేమవరం జంక్షన్ వైపు వెళ్తున్న లారీని తనిఖీ చేసి పర్మిట్లుగా గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. గ్రానైట్ శ్లాబులు ముడిరాళ్లు, మీటరు రాళ్లను పర్మిట్ లేకుండా అక్రమంగా తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. ఎంతటి వారికైనా పెనాల్టీతో పాటు లారీని సైతం సీజ్ చేస్తామని వీరేష్ హెచ్చరించారు.

శాకంబరీ దేవిగా గంగమ్మతల్లి

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మ తల్లిని ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన అమ్మవారిని భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి పలురకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కళాకారుడి కుటుంబానికి గాత్ర వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించినట్లు సంఘ అధ్యక్షుడు శేషగిరి చెప్పారు. వివరాలు పట్టణానికి చెందిన కళాకారుడు షేక్ మౌలాలి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. యజమానిని కోల్పోయిన ఆ కుటుంబానికి రూ.10 వేలు సాయంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కే పెద మస్తాన్, పీ శేషగిరిరావు, టీ శాయి, ఎస్ సైదా, రహీమ్, ఎం వీరాంజయ్య, రమేష్, శ్రీను, అనీల్, వాసు, పీ వెంకటేశ్వర్లు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల శాంతికి భంగం కలిగిస్తే చర్యలు

పర్చూరు (చినగంజాం): రౌడీ షీటర్‌లు, పాత నేరస్తులు మంచి నడవడికతో బతకాలని, ప్రజల శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎన్ చెంచు ప్రసాద్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం పర్చూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, పాతనేరస్తులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. పదేపదే ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. జిల్లా బహిష్కరణ వంటి కఠిన చర్యలుంటాయని తెలిపారు. చెడు అలవాట్లకు స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ తొలగిస్తామని ఎస్సై అన్నారు.

ప్రేమించాలని మైనర్‌పై వేధింపులు

అద్దంకి రూరల్: ప్రేమించాలని వేధిస్తున్నాడని మైనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్సై ఆదిలక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన తన్నీరు శ్రీహరి కొంతకాలంగా «ప్రేమిస్తున్నాను.. పెళ్లిచేసుకుంటా, ఇంట్లో చెబితే చంపుతా» అని వేధిస్తున్నాడు. విషయాన్ని ఆ బాలిక ఆదివారం తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు శ్రీహరి ఇంటికి వెళ్లి నిలదీయగా.. అతని తల్లిదండ్రులు దాడి పాల్పడ్డారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని వెంపరాల గ్రామ సచివాలయ పరిధిలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్నాల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో పరిపాలన ప్రజల వద్దకు తెచ్చారన్నారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. ఎవరెన్నీ కుతంత్రాలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, మండల, గ్రామ నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తారని గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వైద్యులు కృష్ణ శ్రవంత్, అమూల్య, బాలాజీ తెలిపారు. ఆదివారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో మెదడు, గుండె, నరాలు, వెన్నముక, కీళ్లకు సంబంధించి 232 మందికి ఈసీజీ, ఏకో, యాంజియోగ్రామ్ పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. వీరిలో 45 మందిని గుంటూరు వైద్యశాలకు రావాల్సిందిగా సూచించారు. శిబిరంలో పీఆర్వో గోపాలకృష్ణ, స్థానిక ఆర్‌ఎంపీ టీ. వెంకటనరసయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

అద్దంకి రూరల్: అద్దంకి శాఖ గ్రంథాలయానికి అద్దంకికి చెందిన మంతెన రామగోపాలకృష్ణమూర్తిరాజు మధుబాబు, సూర్యదేవర రామ్మోహనరావు, యద్దపూడి సులోచనరాణి, మల్లాది వెంకట కృష్ణమూర్తి రచించిన నవలలను అందజేశారు. ఈ పుస్తకాలను గ్రంథాలయానికి వచ్చిన ప్రతి పాఠకుడు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు సుగుణరావు కోరారు.



పుస్తకాలు అందజేసిన దాత

పుస్తక పఠనంతో విజ్ఞానం

సంతమాగులూరు (అద్దంకి): పుస్తకాలు చదవడంతో మానసిక విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. హాజరైన విద్యార్థులతో పలు రాకల పుస్తకాలు చదివించి వాటిని గురించి వివరించారు. తరగతి పుస్తకాలనే కాకుండా ఇతర పుస్తకాలు చదవడం వలన లోక జ్ఞానం కలుగుతుందన్నారు.



పుస్తకం చదువుతున్న విద్యార్థి

దాతల సాయంతో విద్యలో రాణించాలి

చినగంజాం: దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో మంచి ఫలితాలను సాధించాలని న్యాయవాది కట్టా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో ఒంగోలు బాలసదన్ నుంచి వచ్చి విద్యనభ్యసిస్తున్న అర్బన్ బాలికలకు దాత గండి పుల్లమ్మ తన సొంత నిధులను సమకూర్చి రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఆశ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందిస్తున్న దాత పుల్లమ్మ, శ్రీనివాసరావు